'రైతుభరోసా' కోసం ఎదురుచూపు

- పెట్టుబడుల కోసం రైతుల తిప్పలు
- మార్గదర్శకాలు విడుదల చేయని ప్రభుత్వం



రెబ్బెన: పంటల సాగుకు అవసరం అయ్యే పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందికి గురికావద్దనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. రెండు సీజన్‌లకు కలిసి ఎకరానికి రూ. 10వేల చొప్పున చెల్లించింది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతుభరోసా పథకం కింద రైతులకు ఎకరానికి రూ. 15వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అయితే రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వం పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం అందచేసింది. కనీసం వానాకాలం సీజన్‌లోనైనా పెట్టుబడి సాయం పెంచి సకాలంలో అందచేస్తుందని భావించినప్పటికీ ప్రభుత్వం రైతుభరోసా పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

12,676 మంది రైతులు..

మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు 12,676 మంది రైతులను గుర్తించారు. గత యాసంగిలో 11, 865 మంది రైతులు బ్యాంకు ఖాతాల వివరాలను అందించగా వాటిని పరిశీలించి 8,786 మంది రైతుల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు ట్రెజరీకి అందించగా.. ప్రభుత్వం 7,87,78,218 రైతుభరోసా కింద పంపిణీ చేసింది. అయితే వానాకాలం సీజన్ నుంచి రైతుభరోసా పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ. 15వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే మండలంలోని రైతులు వానాకాలం పంటల సాగును ముమ్మరంగా చేస్తున్నారు. దాదాపు 90 శాతం రైతులు పత్తి విత్తనాలు విత్తుకోగా, వరి ఇతర పంటల సాగు కోసం సిద్ధం అవుతున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

నిండా ముంచిన వర్షాలు..

వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా.. మండలంలో తొలకరి వర్షాలే తప్పా ఒక్కసారి కూడా భారీ వర్షం కురవలేదు. తొలకరి వర్షాలు పడగానే పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని ఎంతో సంబురపడ్డారు. ముందస్తుగా విత్తనాలు విత్తుకోవటం మూలంగా సీజన్ ముగింపు సమయంలో వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతినకుండా మంచి దిగుబడి పొందవచ్చని ఆశతో ముందస్తుగా విత్తనాలు విత్తుకున్నారు. అయితే సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు కురిసిన అరకొర వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ తరుణంలో ప్రభుత్వం పెట్టుబడి సాయం పంపిణీ చేస్తే రైతులకు ఎంతో మేలు కలిగేది. అయితే ప్రభుత్వం పెట్టుబడి సాయం పంపిణీపై ఎప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెండోసారి విత్తుకోవాలి



మొదటిసారి అప్పులు చేసి కొనుగోలు చేసిన విత్తనాలను నాటితే వర్షాలు సరిగా కురవలేదు. రెండోసారి విత్తనాలను పెట్టాల్సి వస్తోంది. రెండోసారి అప్పులు చేసి విత్తనాలను కొంటున్నాం. పంట పెట్టుబడిసాయం అందితే పంటల పెట్టుబడులకు ఉపయోగంగా ఉండేవి.

– వసంత్‌రావు, గోలేటి

పెట్టుబడి సాయం అందించాలి



సీజన్‌కు ముందే ప్రభుత్వం పంట పెట్టుబడి సాయాన్ని అందచేస్తే పంటల సాగులో పెట్టుబడులకు ఉపయోగపడేవి. కానీ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని ఎప్పుడు అందచేస్తుందో కూడా చెప్పటం లేదు.

– శంకర్, గంగాపూర్

పరిమితులు లేకుండా అందించాలి



రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పంట పెట్టుబడి సాయాన్ని వెంటనే విడుదల చేయాలి. పెట్టుబడులకు ప్రభుత్వం అందచేసే సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పెట్టుబడి సాయాన్ని పెంచి వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలి. ఎలాంటి పరిమితులు, షరతులు లేకుండా అందించాలి.

– మోర్లె శ్రీనివాస్, పాశిగాం

బిల్లులు చెల్లించకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: 'మన ఊరు.. మన బడి' పనులకు సంబంధించి పెండింగ్ నిధులు విడుదల చేయకుంటే పాఠశాలలకు తాళాలు వేయడంతో పాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, వైద్య, నీటిపారుదల, విద్య, ఐసీడీఎస్, వెటర్నరీ, ఈజీఎస్, ఐకేపీశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. డీఈవో అశోక్‌తో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ నిధులకు సంబంధించిన నివేదిక పంపించి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి చెల్లించాలని ఆదేశించారు. అనంతరం జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఐదేళ్ల పరిపాలనలో సాధ్యమైనంత అభివృద్ధి చేశామన్నారు. చివరి సమావేశం కావడంతో ఎంపీపీ, జెడ్పీటీసీలతోపాటు మండల పరిషత్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కంకర టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామ సమీపంలోని లోలెవల్ వంతెన వద్ద గ్రామస్తులు శుక్రవారం కంకర లారీలను అడ్డుకున్నారు. లోలెవల్ వంతెన వద్ద కంకర భారీ లోడ్‌తో టిప్పర్లు వెళ్లడంతో భారీ గుంత ఏర్పడింది. దీంతో అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆగ్రహించిన గ్రామస్తులు జెడ్పీటీసీ దుబ్బుల శ్రీదేవి, నాయకులు దుబ్బుల వెంకన్న, శంకర్‌లతో కలిసి ఆందోళనకు దిగారు. ఓవర్‌లోడ్ టిప్పర్ల కారణంగా రహదారులు ధ్వంసం అవుతున్నాయన్నా రు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవ డం లేదని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామస్తులతో మాట్లాడి శాంతింపజేశారు.

వ్యవసాయాధికారిగా ఆకాశ్ ఎంపిక

కెరమెరి: మండల కేంద్రానికి చెందిన కేంద్రే పరమేశ్వర్, విజయలక్ష్మి దంపతులు కుమారుడు కేంద్రే ఆకాశ్ మండల వ్యవయాసాధికారిగా ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో విజయం సాధించాడు. కష్టపడి చదివితే తప్పక విజయం సాధించవచ్చని ఆకాశ్ నిరూపించాడు. అధికారులు, నాయకులు, మిత్రులు ఆయనను అభినందించారు.

పని గుర్తింపు బోర్డుల ఏర్పాటు

కెరమెరి: మండలంలోని గతేడాది జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసిన పలు ప్రాంతాల్లో శుక్రవారం నుంచి పనిగుర్తింపు బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం 50 బోర్డులను ఏర్పాటు చేశారు. డొబ్రాగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన వర్క్‌సైట్ బోర్డులను ఎంపీడీవో అంజద్ పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లేశ్ పరిశీలించారు. మరో రెండురోజుల్లో అన్ని పని ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని ఈజీఎస్ ఈసీ, టీఏలకు ఆదేశించారు.

మత్స్యకారుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

బెజ్జూర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన మత్స్యకారుల సంఘం సభ్యులు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును శుక్రవారం కలిశారు.కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో సంఘం పెద్దలు కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. మత్స్యకారుల భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసినవారిలో మత్స్యకారుల సంఘం నాయకులు గుమ్ముల బాలయ్య, సుర్ల బాలయ్య, గుమ్ముల శ్రీనివాస్, పోచోయ్య, శ్రీకాంత్, అశోక్, బెజ్జూర్ మాజీ ఎంపీపీ కోండ్ర మనోహర్‌గౌడ్, నాయకులు సామల తిరుపతి, ఏలేశ్వరం రమేశ్ తదితరులు ఉన్నారు.

ఆటాపాటలతో కూడిన విద్యనందించాలి



శిక్షణ ఇస్తున్న అధికారులు

కౌటాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటాపాటలతో కూడిన విద్యనందించాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం రెండో రోజు మండల కేంద్రంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు జాతీయ నూతన విద్యా విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన విద్యాచట్టానికి అనుగుణంగా పిల్లలకు బోధించాలన్నారు. కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షకీరా బేగం, కరుణ, పద్మ, శంకరమ్మ, హసినా బేగం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: కాంగ్రెస్‌తో అభివృద్ధి సాధ్యమని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రైతుల పోడు భూముల సమస్యలు పరిష్కరిస్తామని, సిర్పూర్ ప్రాంత రైతుల సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కృషి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, శ్రీని వాస్, శంకర్, సత్తయ్య, శ్రీరాములు, వంశీ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఏబీవీపీ నాయకులు డీఈవో కార్యాలయం ఇన్‌చార్జి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కన్వీనర్ నవీన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్ట్ అమ్ముతున్నారని, చాలా పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు కాక ఇష్టారాజ్యంగా వసూల్ చేస్తున్నారని ఆరోపించారు. హరికృష్ణ, అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం సందర్శన



మ్యూజియంలో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు మ్యూజియం సందర్శనతో సంస్కృతిక, చారిత్రాత్మక జ్ఞానం సిద్ధిస్తుందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ ఆశ్రమ పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులు హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియంను సందర్శనకు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. మ్యూజియంలో పురాతన వస్తులను చూపించడం జరిగిందన్నారు. ఇలాంటి పర్యటన విద్యారంగంలో మరింత రాణించేందుకు దోహదపడతాయన్నారు.

ముంచెత్తిన వరద



బంబార దిశ మోడల్ పాఠశాలలో చేరిన వరద

వాంకిడి మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వరదనీరు గ్రామాలను చుట్టుముట్టింది. బంబార గ్రామంలోని దిశ మోడల్ స్కూల్ ఆవరణలో, ఖోబ్రగడే వసంత్‌రావు, శెనిగరపు అనిల్‌కు చెందిన ఇంట్లో మోకాలిలోతు వరదనీరు చేరింది. దిశ పాఠశాల ఆవరణ వరద నీటితో నిండడంతో సెలవు ప్రకటించారు. గోయేగాం లోనూ పలువురి నివాసాల్లో వరద నీరు చేరి నిత్యావసర సరుకులు, సామగ్రి పాడైపోయాయి. తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీవో ఖాజా అజీజుద్దీన్ బంబార గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వరదనీరు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

- వాంకిడి



గోయేగాంలో ఇళ్లలోకి చేరిన వరద నీరు



బంబార గ్రామంలోని ఖోబగడే వసంత్ ఇంటిలో నిండిన వరద నీరు

'పోడు' సమస్య పరిష్కరించండి



మాట్లాడుతున్న రైతులు

కాగజ్‌నగర్‌రూరల్: బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన పోడు రైతులు శుక్రవారం సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌ను కలిశారు. తాము సాగు చేస్తున్న పోడుభూమిని ఫారెస్ట్ అధికారులు స్వాధీనంలో తీసుకుంటా మంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకున్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుస శంకర్, జగ్గా గౌడ్, తెలంగాణ జావిద్, అబ్దుల్ హకీం, రాజన్న బాపురావు, బాపు, పోడు రైతులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



విద్యార్థితో చదివిస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: బడీడు పిల్లలు బడిలో చేర్పించాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇంద్రానగర్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు ను పరిశీలించారు. విద్యార్థులు తక్కు వ రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

దివ్యాంగుల బస్‌పాస్‌లకు నేడు దరఖాస్తుల స్వీకరణ

సిర్పూర్(టి): మండలంలోని దివ్యాంగులకు ఆర్టీసీ జారీ చేసే రాయితీ బస్‌పాస్‌ల కోసం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సభా స్థలం పరిశీలన



పరిశీలిస్తున్న శ్రీనివాస్, నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: సిర్పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఈనెల 30న విచ్చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సభా స్థలాన్ని శుక్రవారం కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య, డైరెక్టర్ మైలారపు మురళీధర్, పీఏసీఎస్ చైర్మన్ ఉమా మహేశ్వర్‌రావు, ఎమ్మాజీ సంతోశ్ పాల్గొన్నారు.

సన్మానం

వాంకిడి: మండలంలోని ఖిరిడి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి ఇటీవల జరిగిన బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులపై వెళ్తున్న సోయం ఇందురావును శుక్రవారం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శోభ, శృతి, తిప్పారెడ్డి రాజు, మడావి గణపతి పాల్గొన్నారు.

వారసంత వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కౌటాల: కౌటాల వారసంత, పశువుల సంతల నిర్వాహణ రుసుం వసూలు చేసేందుకు శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కౌటాల ఎంపీవో మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అధికారులు వేలం నిర్వహించారు. పలువురు వ్యాపారులు పాల్గొని పోటాపోటీగా వేలం పాడారు. వారసంత నిర్వహణకు రూ. 4.20 లక్షల వేలం పాడి కౌటాలకు చెందిన ఆత్రం ఉమేష్ దక్కించుకున్నారు. పశువుల సంత నిర్వహణకు రూ. 11 లక్షల వేలం పాడి కౌటాలకు చెందిన నేర్పల్లి అర్జున్ దక్కించుకున్నారు. సమావేశంలో కౌటాల ఎంపీపీ బసార్కార్ విశ్వనాథ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

రెబ్బెన: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండలంలోని వంకులం, ఎడవెల్లి గ్రామాల్లో డీవైఎఫ్ఐ నాయకులు సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చెత్త కుండీలు సక్రమంగా లేకపోవటంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోందన్నారు. మురుగునీరు రోడ్లపై పారుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్యాం, కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షుడు క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం పీవీ నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, సుధాకర్, జైరాం, అనిల్, గణేష్, పత్రు, విజయ్‌కుమార్, దాదాజీ, రమేశ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని శుక్రవారం పట్టణంలోని సీనియర్ సిటీజన్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌ఆర్ మూర్తి, పురుషోత్తం, నారాయణ, ఎల్లాగౌడ్, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, ఫారూఖ్, రమణయ్య పాల్గొన్నారు.